# పసివాడు

"దేశంలో పిల్లలకేమన్నా కొరతా .... పెంచుకోడానికి పిల్లలే దొరకలేదా? .... రామారావు తీరు మరీ చోద్యంగా ఉంది.'' అని బంధువులు అతని పరోక్షంలో అతన్ని తీసి పారేయడం ఈ మధ్యనే మొదలయింది.

వాళ్ళలా అనుకొంటున్నారని రామారావుకి తెలిసింది. నవ్వుకున్నాడు.

చుట్టాలకి చోద్యంగా ఉన్నంత మాత్రాన తన తీరు మార్చుకోడానికి రామారావు ఇష్టపడలేదు.

ఫలితంగా ఏడాది తిరిగేసరికి పెద్దాసుపత్రి మంచంమీద తేలాడు మనిషి.

"మీరు పూర్తిగా అలవాట్లు మార్చుకోవాలి.

బ్రతికి ఉండాలని మీరు కోరుకుంటే కనక లిక్కరు పూర్తిగా మానె య్యాలి" అన్నాడు డాక్టరు.

"ఏంకూసావురా" అంటూ డాక్టరు కాలరు పట్టుకున్నంత పనిచేసాడు రామారావు. నీకు వైద్యం చేతనైతే చెయ్యి. లేకపోతే మానెయ్యి. ఉచిత సలహాలు పారైకు. అన్నీ మేం మానేస్తే మీ డాక్టర్లెందుకురా. బోడి సిగరెట్లు కాల్చక, మందుకొట్టక, వక్కపొడి నమలక బతికే దెలాగురా వారేయ్. అయినా కానీ వెధవ నీతులు చెప్పొచ్చావ్. రోజూ డెక్కన్‌క్లబ్బులో సాయంత్రాలు నిన్ను చూశ్చేదనుకున్నావా? నీబ్రాండు ఏమిటోకూడా చెప్తానా రేయ్!" అంటూ రామారావు సంధి ప్రేలాపన లంకించుకుంటే కుర్రడాక్టరు కుందేలై పోయి "అబ్బే ఏమి అనుకోకండి మీకంత ఇదయితే అదిమానకండి. నాకేంనష్టం? ... నష్టమూ, కష్టమూ అంతా రేపు మీ పిల్లలదే..." అని వాగేసి కొంపమీదకి తెచ్చుకున్నాడు.

పిల్లల 'ఊ'సెత్తగానే రామారావు తాండవుడైపోయాడు.

"నాజబ్బేమిటో నీకసలు తెలిసేడిస్తేకదా! గుండెజబ్బు అనుకుంటు న్నావు. నా జబ్బు గుండెక్కాదురా సన్నాసీ, హృదయానికి. బాటిల్‌తో పాటు మింగమంటే బిళ్ళలు మింగుతాను రాసెయ్యి." అని కుర్ర డాక్టరు మీద రంకెలు వేసాడు రామారావు.

కుర్రడాక్టరు చాలాసేపు నోటమాట రానట్టు నిలబడిపోయి "అలాంటి బిళ్ళలేమీ ఇంకా కనిపెట్టలేదుట శాస్త్రజ్ఞులు" అనేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

డాక్టరుల మీద కోపం సెడెటివ్‌లతో తీర్చుకుని వారం తరువాత డిశ్చార్జి అయ్యాడు రామారావు.

తిన్నగా మెంబర్‌షిప్ ఉన్న క్లబ్బులన్నీ చూసేసి క్లబ్బులు మూసి వేళాక ఓ జనతాబార్‌లో సెటిలయ్యాడు. అప్పటికి పది రౌండులు పూర్త య్యాయి. ఎదురుగుండా రామకృష్ణ నించొని ఉన్నాడు.

"వదిన నిన్ను వున్నట్టుండి తీసుకురమ్మని పంపించింది" అన్నాడు రామకృష్ణ.

"తీసుకెడుదుగాని, నానిగాడి బర్త్‌డేకదా. రెండుజతల బట్టలు, బొమ్మలూ అవీ కొందామని చూస్తున్నాను" అన్నాడు రామారావు.

"నానిగాడి పుట్టినరోజు అయిపోయి పదిరోజులయ్యింది. ఇంకా ఏడాది టైముందిలే. కొందుగాని తొందరేమొచ్చింది? ఈ పూటకి ఇక తిరుగుడు చాలించి ఇంటికొస్తే వదిన సంతోషిస్తుంది" అన్నాడు రామకృష్ణ.

"నాన్సెన్స్ నానిగాడి పుట్టినరోజుకి నేను బట్టలు కొంటాను. ఎప్పుడు బర్త్‌డే ఒస్తే అప్పుడు తొడుగు, ఒద్దనానికి నువ్వెవడివిరా ఫూల్...".

రామారావు రాత్రి పొద్దెక్కేదాక తాగి తాగి ఏ ఆటో వాడినో బతి మాలి వందరూపాయల నోటిచ్చి తమ్ముడి ఇళ్ళకి వెళ్ళి నిద్రపోతున్న పిల్లకాయల్ని బలవంతంగా లేపుతాడు. వాళ్ళు మొర్రో అని ఏడుస్తున్నా పట్టించుకోకుండా 'గుర్రం ఆట ఆడదాంరా ఒరేయ్. నామీద ఎక్కండ్రా సవారీ చెయ్యండ్రాబాబూ. ఇదిగో నీకు బిస్కెట్ ప్యాకెట్టు. ఇదిగో ఒసే నీకు రేపు పండక్కి పట్టుపరికిణీ''. అంటు వాళ్ళని కౌగిలించి ముద్దులు పెట్టుకుంటాడు. వాళ్ళ చీమిడి ముక్కుల్ని చొక్కాతో తుడిచి తెచ్చిన పదార్థాలన్నీ తినమంటాడు. అర్ధరాత్రివేళ అంకమ్మ శివాలని ఆ

రాత్రి పూట గోల్కొండకోట చూపిస్తా పిల్లల్ని తనతో పంపించ మంటాడు.

ఆ పూట కూడా అంతే చేశాడు.

రామకృష్ణ ఒద్దురా అన్నయ్యా అని మొత్తుకుంటున్నా వినకుండా నానిగాడికి బట్టలంటూ ఆటోలో బయల్దేరదీశాడు మూసి ఉన్న ఓ షాపు తెరిపించి నాలుగొందలు బిల్లు చేశాడు. బతుకు జీవుడా ఇక కొంపకి బయల్దేరదాం అని రామకృష్ణ అనుకున్నదంతా వట్టిదే అయింది. నానిగాడికి మూడొందల బంగినిపల్లి మామిడిపళ్ళు కొనాలనుందన్నాడు రామారావు ఆవేశ. "చచ్చాను" అని గట్టిగానే అరిచేసాడు రామకృష్ణ.

"కాలం కాని కాలం ఇది. ఇప్పుడు మామిడిపళ్ళేమిటి?" అని కూల బడి పోయాడు.

"మామిడిపళ్ళకి కాలం ఏమిట్రా ఫూల్! అవేమన్నా అరిటిపళ్ళా వేసవిలో తప్ప ఉండవనుకోడానికి? దిల్‌సుఖ్‌నగర్ అవతల కొత్తగా పెట్టాడు చూడు పళ్ళమార్కెట్టు. అక్కడ చూసాను. అన్నీ మామిడి మామిడిపళ్ళే" అని రామారావు ప్రకటన.

"అవును చూసావు. కానీ ఎప్పుడు? క్రిందటి వేసవిలో" రామకృష్ణ నీరసం.

"అప్పుడు వచ్చని చూసాను. ఇప్పుడు పండిఉంటాయి" రామారావు వివరణ.

"ఒద్దురా అన్నయ్యా! ఇంతరాత్రిపూట అంతదూరం వెళ్ళి లేని మామిడిపళ్ల ఎలాకొంటాం ఇదిగో ఇక్కడ అరటిపళ్లున్నాయి. కాని

మూడొందలున్నాయో లేవోమరి. అయినా అన్ని పళ్ళు నానిగాడు ఎలా తింటాడు?'

"తినకపోతే అబ్బిగాడు పారేస్తాడురా! నీకెందుకదంతా? అయినా ఇలాగేనా పిల్లల్ని పెంచడం. ప్రతీదీ ఒద్దంటావు. పట్టి ఫూల్ లా వున్నావు ఫూల్!"

ఆ రాత్రిపూట ఆ దిల్ సుఖ్‌నగరేదో అక్కడికి వెళ్ళక తప్పలేదు. ఆటోలో రామకృష్ణ నిద్రపోయాడు. రామారావు జేబులోంచి ఒకనిప్ తీసి ఇన్ని బ్రాందీ చుక్కలు తమ్ముడు ముఖం మీద చిలకరించి చూసాడు. లాభం లేకపోయింది. "ఎప్పుడూ రాత్రిళ్ళు నిద్రపోతాడు. పిల్లల్ని కనడం ఎలా తటస్థపడిందో ఈ ఫూల్ కి" అని ఆశ్చర్యపోయాడు రామారావు.

వళ్ళమార్కెట్టు అంటూ ఏమీ కనపడలేదు గానీ ఆ రాత్రిపూట కొబ్బరికాయలబండి ఎదురొచ్చింది. బండివాణ్ని బతిమాలి రెండు వందల రూపాయలిచ్చి ఓ డజను 'కొబ్బరిపళ్ళు' ఆటోలో వేయించాడు రామారావు. దివ్యంగా ఉంది.

ఇప్పుడు తమ్ముడింటికి వెళ్ళి నానిగాణ్ణి నిద్రలేపాలి. మరదల్ని కూడా నిద్రలేపి నానిగాడికి కొత్తబట్టలు తొడిగించాలి. కనీసం రెండన్నా కొబ్బరిపళ్ళు వాడిచేత తినిపించాలి. అదీ ప్రణాళిక. అప్పుడు చేతి గడియారంలో ఒంటిగంటయ్యింది.

ఆటోవాడు విసుక్కుంటూ విజయనగర్ కాలనీకి తిరిగి ప్రయాణమయ్యాడు.

ఆటో ఆగింది ఇంటిముందు.

ఎప్పుడు నిద్రలేచాడోగాని రామకృష్ణ దిగబోతున్న రామారావుని 'అగన్నయ్యా ఆగు' అన్నాడు.

"ఏమిట్రా ఆగేది. వెళ్లు వెళ్ళి నానిగాణ్ణి నిద్రలేపు. ఆటోవాణ్ణి వంపించి ఒస్తాలే." అంటూ కొబ్బరికాయలు దింపడానికి తూలుతూ ఉపక్రమించాడు రామారావు.

"నువ్వు నీ ఇంటికిపదన్నయ్యా! అవన్నీ ఇప్పుడు దించకు" రామకృష్ణ విసుక్కున్నాడు.

"ఏమిట్రా ఫూల్! ముందు నానిగాణ్ణి చూసి మెల్లగా నడచుకుంటూ నేను వెడతాలే ఇంటికి. నువ్వు నన్నేమీ దిగబెట్టనక్కరలేదు"

"వీల్లేదు" అని అరిచాడు రామకృష్ణ. రామారావు చేతిలోగ్లాసు జారిపడి పగిలినట్లు చూసాడు. "ఏవిట్రా నీ అన్నయ్యని. పెద్దవాళ్ళ మీద ఫూల్లా అలా అనుస్తావేమిట్రా ఫూల్' అని ఆటోదిగి నిలబడి పోయాడు తూగుతూ.

"పెద్దవాడివి కదా అని గౌరవిస్తూంటే ఫూల్ గీల్ అంటో ఏమిటి నీ పెద్దరికం. పిల్లలమీద ప్రేమంటూ మమ్మల్ని చంపుకు తింటున్నావ్. ఇంత రాత్రివూట నానిగాణ్ణి నిద్రలేపడానికి వీల్లేదు"

"ఒరేయ్ తమ్ముడూ! ఏమిట్రా అది. ఒక్క ముద్దు పెట్టుకొని వెళ్ళి పోతాన్రా నానిగాణ్ణి"

"అయామ్ సారీ! వీలుపడదు"

"ఏరా! ఎందుకురా! నేనేపాపం చేసా[నా? బాబొరే తమ్ముడూ రామ కృష్ణా చెప్పరా"

"వీల్లేదూ వీల్లేదూ వీలేదు! నీ [పేమని నా పిల్లలు భరించలేకపోతు న్నారు. మొన్నరాత్రి ఇలాగే వచ్చి పాపని ముద్దులతో నలిపేసావు. దానికి జ్వరం పట్టుకుంది." కాలనీలో కొన్ని తలుపులు తెరుచుకున్నాయ్" చుట్టూ జనం పోగవటం ప్రారంభమయ్యింది.

హఠాత్తుగా రామకృష్ణకి చెప్పలేని చిన్నతనంగా తోచి ఆటోలోంచి కొబ్బరికాయలు తీసి విసిరేసాడు. రామారావు చేతిలోంచి బట్టల ప్యాకెట్టు లాగి పక్కనే ఉన్న చెత్తకుండీలోకి విసిరేసాడు.

"నానిగాడికి రేపు పరీక్ష. తెల్లారకట్ట లేచి చదివిస్తుంది నీమరదలు. ఈ రాత్రివేళ వాణ్ణి నువ్వు చూడ్డం పడదు. అర్థం అయ్యిందా?" అని వెళ్ళిపోయాడు ఇంట్లోకి. అర్జంటుగా ఇప్పుడు అర్థం చేసుకోడం తెలీనట్లు చూసాడు రామారావు.

"అవున్రా. పిల్లలంటే నాకు [పేమ. అంతమాత్రం చేత వాళ్ళని [పేమతో నలిపెయ్యకూడదనీ, జాగ్రత్తగా ముద్దులు పెట్టుకోవాలనీ, నిద్రలేపకూడదనీ, పెంచడం నేర్చుకోవాలనీ నాకేం తెలుసురా. పరీక్షకి చదివించుకోరా నీకొడుకుని. ఒరేయ్ పరీక్షకి బాగా చదివించుకో. నా కొద్దురా ఆ చందమామలు. పెంచడం తెలియక చంపుకుంటానేమో ఒద్దురా ఒరేయ్" అంటూ రామారావు తూలిపడిపోబోతే నలుగురూ పట్టుకుని ఆటోలోకి చేర్చారు.

మరోవారం రోజుల తరువాత ....

పెద్దాసుపత్రిలో

మీరు డ్రింకింగ్ మానెయ్యాలని డాక్టర్లందరూ చెప్పారు రామారావుకి.

ఎవరి పిల్లాడ్నయినా దత్తతతీసుకోమని బంధువులందరూ పోరాడారు రామారావుని.

జవాబు లేదు!